www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 26 మే 2023

5

వైఎస్‌ఆర్



నర్సింగ్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి



మాట్లాడుతున్న అంకన్న

కడప అర్బన్: ప్రభుత్వ నిబంధలనకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ విజదుర్గ, సోనియా ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, పిఎస్‌యు రాష్ట్ర కార్యదరి సుబ్బరాయుడు, ఎఐఎఫ్‌బి రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఆర్ ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ప్రగతి నర్సింగ్ హోంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం అనుమతులు కొరకు వేరు వేరు చోట లేని భవనాలు ఉన్నట్లు నకిలీ పత్రాలు చూపింది అనుమతులు పొందారని తెలిపారు. విద్యార్థులను మోసం చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వం

- పాదయాత్రకు వెల్లువెత్తిన ప్రజాభిమానం
- ప్రజల కష్టాలు తెలుసుకున్న నారా లోకేష్
- నాలుగు రోజులు యువగళంకు విరామం
- 30న జమ్మలమడుగులో బహిరంగ సభ



నారా లోకేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమాన్ని మరిచిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 110వ రోజుకు చేరుకుంది. గురువారం వైఎస్‌ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలంలోని ఎన్.కొత్తపల్లె విడిది కేంద్రం నుంచి పెద్దపసుపుల జంక్షన్, పెద్దపసుపుల, పెద్దపసుపుల చావిడి, జమ్మలమడుగు బైపాస్ విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగుగింది. ఆయా ప్రాంతాల్లో ముస్లిములు, గ్రామస్తులు, క్రిష్టియన్లు, రైతులతో మాటామంతి, ముఖాముఖి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ గ్రామాలకు నిధులివ్వకపోగా, గ్రామ పంచాయితీల్లోని రూ.8,660 కోట్లను సర్పంచ్‌లకు తెలియకుండా దొంగిలించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో 25 వేల కి.మీ సిసి రోడ్లు, 30 లక్షల ఎల్ఇడి లైట్లు వేశామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కుందూనది ముంపు సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు. రాజోలి ప్రాజెక్టును 2.95 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించి, నిర్వాసితులందరికీ పరిహారం ఇస్తామని తెలిపారు. జగన్ పాలనలో పేదలు, దళితుల ప్రాణాలు గాలిలో దీపంగా మారాయన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ వారి సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. జగన్ అసమర్థ పాలన కారణంగా రాష్ట్రంలో ఆరోగ్యరంగం కుప్పకూలిందన్నారు. కర్నూలు, అనంతపురం వంటి పెద్దాసుపత్రుల్లో సైతం కనీసం దూది, గాజుగుడ్డలేని దుస్థితి నెలకొందన్నారు. గ్రామ పంచాయితీల నిధులను ప్రభుత్వం దొంగిలించడంతో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా వారి వద్ద నిధుల్లేవన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దళితకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జగన్మోహన్‌రెడ్డి దివాలా ప్రభుత్వాన్ని చూసి కాంట్రాక్టర్లు పారిపోతున్నారు. రోడ్లపై తట్టమట్టి పోసే దిక్కులేదు, నాలుగేళ్లుగా గ్రామ పంచాయితీలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కొన్నిచోట్ల పరువుకోసం సొంత డబ్బుతో పనులు చేసిన సర్పంచ్‌లు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మైనారిటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. మైనారిటీలకు చెందాల్సిన రూ.5,400 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలకు చెందిన వక్ఫ్ బోర్డు ఆస్తులను వైసిపి నేతలు యథేచ్ఛగా అన్యాక్రాంతం చేస్తున్నారన్నారు. నర్సరావుపేటలో మసీదు స్థలం కబ్జాను అడ్డుకున్న ఇబ్రహీంను దారుణంగా నరికి చంపారని తెలిపారు. పేద ముస్లింల వివాహానికి కానుకగా ఇచ్చే దుల్హాన్ పథకాన్ని అడ్డగోలు నిబంధనలతో పూర్తిగా నీరుగార్చారన్నారు. దుల్హాన్ పథకం కింద టిడిపి హయాంలో 32,722 మందికి 163.61 కోట్లు అందజేస్తే, వైసిపి ప్రభుత్వం ఊరికి ఒకరిద్దరికి కూడా పథకాన్ని ఇవ్వలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దుల్హాన్ పథకంలో వైసిపి పెట్టిన షరతులన్నీ తొలగిస్తాం, అర్హులందరికీ పథకం అమలు చేసి, గతంలో మైనారిటీలకు అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామన్నారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటుచేసి మైనారిటీల స్వావలంబనకు కృషిచేస్తాం. జమ్మలమడుగు మైనారిటీలకు కమ్యూనిటీ హాలు, ఉర్దూ పాఠశాల, ప్రత్యేక శ్మశానవాటిక నిర్మిస్తామన్నారు. అర్హత ఉన్న బీడీ కార్మికులందరికీ ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టిడిపి నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కె.జి.ఖదీర్, సయ్యద్, రఫీ, నజీర్, జి.కె.గైబు, బిసి నాయకులు ఎ.కొండయ్య, రాష్ట్ర కార్యదర్శి జె.రమణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు యువగళంకు విరామం

గురువారం మధ్యాహ్నం యువగళం యాత్ర పెద్దపసుపుల రోడ్డులోని జమ్మలమడుగు బైపాస్ వద్ద 110వ రోజు ముగిసింది. 26, 27, 28, 29వ తేదీల్లో నాలుగు రోజులు యాత్రకు విరామం ప్రకటించారు. మహానాడు కార్యక్రమం వలన ఈ యాత్ర ఆగినట్లు యువగళం మీడియా కో-ఆర్డినేటర్ తెలిపారు. ఇప్పటికీ మొత్తం యాత్ర 1423.7 కి.మీ సాగింది. 110వ రోజు 12.3 కిలోమీటర్లు సాగింది. ఈ నెల 30వ తేదీన తిరిగి యువగళం యాత్ర పునఃప్రారంభమవుతుంది. అదే రోజు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

క్లాప్స్‌పై దాష్టీకం

- వేతన చెల్లింపుల్లో చేతివాటం
- కార్పొరేషన్‌లోని ఓ ఉద్యోగి చేతిలో డీ'జిల్'
- కమిషనర్ కనుసన్నల్లో 'చెత్త' వాహన నిర్వహణ
- లేబర్ కోర్టు బాటలో క్లాప్స్ ఉద్యోగులు



నాగరాజుపేటలో చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

క్లాప్స్‌కు దాష్టీకం తప్పడం లేదు. ఏజెన్సీ వేతన చెల్లింపుల్లో కోతల దగ్గర నుంచి సెలవులు, పరిమితికి మించి టిప్పులు, కమిషనర్ కార్యాలయ ఉద్యోగి వాహనాలకు డీజిల్ సమకూర్చడం వంటి చేష్టలతో అగ్రిమెం ట్‌కు భిన్నంగా వ్యవహరించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం ఏడాది కింద చెత్త పన్ను వసూలుకు నిర్వహించిన టెండర్లను సాయిపల్లవి, రెడ్డి ఏజెన్సీలు దక్కించుకున్నాయి. అగ్రిమెంట్ మేరకు ఏజెన్సీలు తడి, పొడి చెత్తను వాహనాల ద్వారా తరలించాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా కార్పొరే షన్‌లో క్లాప్స్ నడుస్తోందనే విమర్శ వినిపిస్తోంది. కమిషనర్ ఏజెన్సీ నిర్వా హకులను పక్కనబెట్టి క్లాప్స్ బాధ్యతలను నిర్వహించడం గమనార్హం. అగ్రి మెంట్‌కు భిన్నంగా వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో క్లాప్స్ లేబర్ కోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతుండడం చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో క్లాప్స్ నిర్వహణ విమర్శలకు నిలయంగా మారింది. ఏడాది కిందటి నుంచి కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో వాహ నాల ద్వారా తడి, పొడి చెత్త సేకరణ నడుస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఏడాది కిందట నుంచి క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో చెత్తను సేకరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగా అప్పట్లో నిర్వ హించిన టెండర్లను సాయిపల్లవి, రెడ్డిఏజెన్సీలు దక్కించుకున్నాయి. కడప, ప్రొద్దుటూరు కేంద్రంగా తడి, పొడి చెత్తను సేకరణ కార్యకలా పాలు నిర్వహించాలి. ఇందులోభాగంగా కడప కార్పొరేషన్‌లో సాయిపల్లవి ఏజెన్సీ 50, రెడ్డి ఏజెన్సీ 50, ప్రొద్దుటూరులో రెడ్డి ఏజెన్సీ 38 వాహనాలతో చెత్త సేకరణను చేపట్టాయి. ఏడాది కూడా నిండక ముందే ఏజెన్సీలు ఉద్యోగులపై దాష్టీకానికి తెరతీయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. ఉద్యోగుల వేతన చెల్లింపుల్లో చేతవాటానికి దిగడం ఆందోళన కలిగి స్తోంది. జిఒ నెంబర్-7 ప్రకారం క్లాప్స్ డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాల్సి ఉంది. కానీ ఆచరణలో రూ.10,050 నుంచి రూ.10,250 పరిమితం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. 1948 యాక్ట్ ప్రకారం కనీస వేతనం, 1952 యాక్ట్ ప్రకారం పిఎఫ్, 1948 యాక్ట్ ప్రకారం ఇఎస్ఐ సదుపా యాలను కల్పించాల్సి ఉంది. ప్రతి వాహనం రోజుకు రెండు టిప్పుల చొప్పున 30 కిలోమీటర్లు తిరగాల్సి ఉండగా, 50 కిలోమీటర్ల వరకు తిప్పుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇదిలాఉండగా కడప కార్పొరే షన్‌లో క్లాప్స్ నిర్వహణ ఇష్టారాజ్యంగా నడుస్తోంది. కమిషనర్ కాంట్రాక్టు ఏజెన్సీలతో చెత్త సేకరణను చేయించాల్సి ఉంది. సక్రమంగా పని చేయని ఏజెన్సీలకు జరిమానా విధించాలి. జరిమానాకు దారికి రాకపోతే రద్దు చేయాలి. ఇటువంటి సామ, ధాన, బేధ, దండోపాయాలను ఉపయోగించ కుండా సర్వం సహా తానుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. ఇదిలాఉండగా కమిషనర్ కార్యాలయానికి చెందిన ఓ ఉద్యో గి క్లాప్స్ వాహనాలకు డీజిల్ పట్టించడం, డ్రైవర్లకు రూ.400 చొప్పున రోజు కూలి ఇవ్వడం వంటి చేష్టలతో అగ్రిమెంట్‌కు భినంగా వ్యవహరిం చడ మేమిటనే వాదన వినిపిస్తోంది. కమిషనర్ కార్యాలయం, ఏజెన్సీ నిర్వాహ కుల అగ్రిమెంటేతర పనులకు పాల్పడుతున్న నేపథ్యంలో క్లాప్స్ ఉద్యోగు లు సిఐటియు ఆధ్వర్యంలో లేబర్‌కోర్టును ఆశ్రయించేందుకు సర్వం సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమైన నేపథ్యం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా కార్పొరేషన్, మున్సిపల్ అధికార యంత్రాంగాలు చెత్త సేకర ణ వ్యవహారాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉం దనడంలో సందేహం లేదు.

కనీస వేతనం చెల్లించాలి



1948 యాక్ట్ ప్రకారం క్లాప్స్‌డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం చెల్లించాలి. కార్మికుల వేతన చెల్లింపుల్లో కోతలకు పాల్పడుతున్న సాయి పల్లవి, రెడ్డిఏజెన్సీలను రద్దు చేయాలి. అనంతరం మరోసారి టెండర్లు నిర్వహించి క్లాప్స్‌ను సజావుగా నిర్వహించాలి. లేనిపక్షంలో క్లాప్స్ కార్మికులు లేబర్ కోర్టుకు వెళ్లే ప్రయత్నాలకు సంపూర్ణ మద్దతుగా నిలుస్తాం.

- బి.మనోహర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, కడప.

సంతృప్త స్థాయిలో ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంతో పాటు ప్రజల నుండి అందే ఫిర్యాదులకు సంతృప్తి కరమైన పరిష్కారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు.గురువారం అమరావతి నుండి.. జగనన్నకు చెబుదాం, హెల్త్/ఐసిడిఎస్ పరిధిలో ప్రభుత్వ పథకాలు మరియు ఎస్డిజి ఇండికేటర్స్, స్కూల్ ఎడ్యుకేషన్, గ్రామ/వార్డు సచివాలయాలు, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, తదితర అంశాలపై.. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు ట్రైనీ/అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ద్వారా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలనే లక్ష్యం మేరకు అధికారులు నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా సచివాలయ బిల్డింగులు, వైయస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంకా వివిధ ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చీఫ్ సెక్రటరీ జిల్లాల కలెక్టర్‌లు, జెసిలు, జిల్లా అధికారులతో సమీక్షించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని, ప్రజల నుండి అందే స్పందన అర్జీలకు వేగవంతంగా, సంతృప్తి కారంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని, ఎక్కడ పెండింగ్ లేకుండా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ, భూ రికార్డుల స్వచ్ఛీకరణ పనులను అన్ని జిల్లాల్లో వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న భూ సేకరణ, పరిహారం ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎక్కడా కూడా తాగునీటి కొరత లేకుండా మంచినీటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పశు వైద్య కేంద్రాల్లో వసతులను మెరుగు పరచాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ లు స్టేజ్ కన్వర్షన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్పందన గ్రీవిన్స్‌తో పాటు 1902 టోల్ ఫ్రీ నెంబర్ ఫిర్యాదుల జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అన్ని అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో.. డ్వామా, డిఆర్డీఏ, ల్యాండ్ సర్వే, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, సంక్షేమ, సర్వే, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

లోన్‌యాప్ మోసగాడు అరెస్టు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

లోన్‌యాప్ ద్వారా మోసాలకు పాల్పడుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన రాహుల్ రజాక్‌ను పోలీసులు అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త మాధవరం గ్రామ నివాసి బండారు కల్పన ఈ ఏడాది ఫిబ్రవరి 10న లార్జ్‌టెకా అనే ఆండ్రాయిడ్ యాప్ ద్వారా అన్‌లైన్‌లో రూ.10వేలు అప్పు కావాలని యాప్ వాళ్లకు దరఖాస్తు చేసుకుందని తెలిపారు. అకౌంట్ వివరాలు తీసుకున్నారని చెప్పారు. రుణం మంజూరు చేశారన్నారు. కొనాళ్లకు రుణం మొత్తం చెల్లించిందని పేర్కొన్నారు. లోన్‌యాప్ ఏజెంట్లు ఫోన్ చేసి రుణ మొత్తాన్ని చెల్లించాలని బెదిరించారని తెలిపారు. లేదంటే ఫొటోలు మార్ఫింగ్ చేసి స్నేహితులకు, బంధువులకు పంపిస్తామని బెదిరించారని చెప్పారు. ఫిబ్రవరి 20న ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు రంగంలోకి దిగి మోసగాడిని అరెస్టు చేశారని పేర్కొనారు. సమావేశంలో అదనపు ఎస్‌పి తుషార దూడి, డిఎస్‌పి షరీఫ్, సిఐ పురుషోత్తం రాజు, మధుసూదన్‌రావు, శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి-చెన్నూరు



నేత్ర దానం చేసిన రామసుబ్బారెడ్డి (ఫైల్‌ఫొటో)

మండలంలోని ముళ్లపల్లె గ్రామానికి చెందిన గోసుల రామ సుబ్బారెడ్డి (72) అనారోగ్యంతో గురువారం మరణించడంతో ఆయన భార్య పద్మావతమ్మ, కుమారులు వెంకట సుబ్బారెడ్డి, వెంకటశివారెడ్డి, కుమార్తె మాధవి, కోడళ్ళు కృష్ణవేణి, లక్ష్మీదేవి, అల్లుడు చిన్న సుబ్బారెడ్డిలను ఎపి ఆగ్రోస్ రాష్ట్ర అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి నేత్ర దానంపై అవగాహన కల్పించి నేత్ర దానం చేసేందుకు ఒప్పించారు. అనంతరం ఆయన పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రనిధి అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో నేత్రనిధి టెక్నీషియన్ హరీష్ హుటాహుటిన మృతుని స్వగృహం వెళ్లి పార్థివదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా ఎపి ఆగ్రోస్ రాష్ట్ర అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రనిధి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం శరీరంతో పాటు మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ఇవ్వడంతో పాటు అంధత్వ నివారణకు తోడ్పాటునందించిన వారవుతారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులు ఎవరైనా మరణించి నేత్రదానం నేత్రదానం చేసేందుకు అంగీకారం తెలిపి 9966509374 లేదా 7093204537లకు సమాచారం ఇచ్చినట్లు అయితే అంత్యక్రియలకు ఎలాంటి ఆటంకం కలగకుండా కార్నియాలను సేకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం నేత్రదానం అనే బృహత్కార్యాన్ని కుటుంబ సంప్రదాయంగా భావించి అంధ రహిత సమాజం కోసం తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేత్రదానానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, గ్రామ పెద్దలు సేవా సమితి బృందం కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

గోవాకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వేసవి విహారయాత్ర కోసం ఎపిఎస్‌ఆర్‌టిసి జిల్లా నుంచి గోవాకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న కడప డిపో నుంచి ఇంద్ర బస్సు, 27న మైదుకూరు డిపో నుంచి ప్రొద్దుటూరు మీదుగా సూపర్ లగ్జరీ బస్సు గోవాకు ప్రత్యేకంగా నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కడప-గోవా (ఇంద్ర) టికెట్ ధర రూ.3,074, మైదుకూరు-గోవా (వయా ప్రొద్దుటూరు/సూపర్ లగ్జరి) రూ.2,386 టికెట్ ధర అని పేర్కొన్నారు. వేళాంగిణి, తిరున్నా మలైకి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

స్థలం విషయమై దంపతులపై దాడి

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నమయ్య జిల్లా రామాపురం మండలం ఉడుంవారి పల్లెలో నివాసముంటున్న షేక్ అల్లా బకాష్, షకీల దంపతులకు వారి బంధువైన షేక్ అబ్దుల్ సలాం, షకీల దంపతులకు, బంధువుల అయిన అబ్దుల్ సలాం, సుభాన్, మొహమ్మద్ గౌస్ మధ్య 4.30 సెంట్లు స్థలం విషయంలో కొన్ని సంవత్సరాలుగా వివాదం ఉంది. సంస్థల విషయమై తమపై దాడి చేశారని దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ అరుపులకు స్థానికులు వినడం ద్వారా నింధితుల నుంచి కాపాడారని పేర్కొన్నారు. రిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారని చెప్పారు. దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవలని కోరారు.

27న ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని ఓ- బ్లాకులో గల జిల్లా ఉపాధి కార్యాలయం ఆవరణలో ప్రముఖ కంపెనీ అయిన వినూత్న ఫెర్టిలైజర్స్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్స్ హోదాలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి.దీప్తి తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ పాసై ఉండి వయస్సు 19-30 సంవత్సరాల మధ్య కలిగి ఉన్న అభ్యర్థులు ఉద్యోగమేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 8790156565 నంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు.

సెల్ ఫోన్లు రికవరీ : బాధితులకు అప్పగింత

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ద్వారా పోగొట్టుకున్న సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బాధితులకు సెల్‌ఫోన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో రూ.1.75 కోట్ల విలువైన 669 మొబైల్ ఫోన్లు సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం రికవరీ చేసిందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు లేకుండా ఫోన్లు పోగొట్టుకున్న వారికీ తిరిగి అందజేయాలని సంకల్పంతో గత ఏడాది డిసెంబర్ ఒకటిన ప్రారంభించామని చెప్పారు. ఉచిత వెబ్ సైట్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మరింత సులువైన సేవలు అందించడానికి చాట్‌బాక్స్ ద్వారా 9392941541 సేవలు ప్రారంభించామని పేర్కొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

పందులను ఊరికి దూరంగా ఉంచాలి

- కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో పందుల పెంపకం దారులు ఊరికి దూరంగా పందులను ఉంచాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో పందుల పెంపక దారులు, హెల్త్ విభాగ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిసర ప్రాంతాల్లో ఉన్న పందులు ప్రజా ఆరోగ్యానికి భంగం కల్పిస్తూ వీధుల్లో తిరుగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. రాతపూర్వకంగా, మౌఖికంగా హెచ్చరించినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. పందుల వల్ల ప్రజలకు వ్యాధు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నివాస ప్రాంతానికి దూరంగా తరలించాలని ఆదేశించారు. పందులపు శాస్త్రీయ పద్ధతిలో పెంచాలని చెప్పారు. పందులు పెంపకం దారులు వారి సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ హెల్త్ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు : ఎస్ఇ

ప్రజాశక్తి-కడప

విద్యుత్ వినియోగదారులు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తక్షణం పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ అన్నారు. గురువారం విద్యుత్ భవన్‌లో డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా కడప, ఖాజీపేట, ముద్దనూరు, జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె, కమలాపురం, కొండాపురం, ప్రొద్దుటూరు, పెండ్లిమర్రి, తదితర ప్రాంతాల నుండి వివిధ రకాల విద్యుత్ సమస్యలు వినియోగదారులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన సమస్యలు, లైన్లు, డిటిఆర్‌కు సంబంధించిన సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ఇతర సమస్యలు కూడా ఉన్నట్లు తెలిపారు. వీటన్నిటినీ తమ సిబ్బంది తక్షణం పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యం, జెఇ జి.లావణ్య పాల్గొన్నారు.



వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఇ

మున్సిపల్ రాష్ట్ర జాతాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపు నిచ్చారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో రాష్ట్ర జాతా కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని అసెంబ్లీ, పాద యాత్రలో చెప్పారని తెలిపారు. రెగ్యులర్ కార్మికులకు సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచారని చెప్పారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నంబరు 7 ప్రకారం స్కిల్డ్ వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు దళాలుగా జాత ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మొదటి ఇచ్ఛాపురం నుంచి ఒక దళం, హిందూపురం నుంచి మరోదళం ఈనెల 31 నుంచి జాత ప్రారంభిస్తాయని తెలిపారు. అక్కడి నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు మీదుగా బద్వేల్ చేరుకుంటుందని చెప్పారు. రాత్రి కడపలో ఉంటారని పేర్కొన్నారు. 4వ తేదీ ఉదయం కడప పాతబస్టాండ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. జాతా తరువాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, పి.వి.సుబ్బయ్య, నాయకులు పాపిరెడ్డి, మున్సిపల్ నగర ప్రధాన కార్యదర్శి వై.ఎం.కేశవులు, జిల్లా సహాయ కార్యదర్శ ఎం.ఆనందరావు, ప్రవీణ్, గోపాల్, పవన, దస్తగిరి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు, మున్సిపల్ నాయకులు

రాజ్యాంగ పదవిని అవమానించడం బాధాకరం

ప్రజాశక్తి - కడప

కొత్త పార్లమెంట్ భావన ప్రారంభోత్సవానికి గాని ప్రారంభించడానికి గాని భారత రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం రాజ్యాంగ పదవిని అవమానించడమేనని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ అంటే రాష్ట్రపతి, రాజ్యసభ, లోక్‌సభ సమూహం అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 79 స్పష్టంగా చెబుతుందన్నారు. రాష్ట్రపతి అంటే ప్రభుత్వాధినేత అయినప్పటికీ పార్లమెంటులో భాగమన్నారు. పార్లమెంటు సమావేశం కావడానికి సమన్లు జారీ చేయడం ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం రాష్ట్రపతి ద్వారానే ఉంటుందని గుర్తు చేశారు. పార్లమెంట్లో చేసిన చట్టాలు అమలులోకి రావాలంటే రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి అని అన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రపతి లేకుండా పార్లమెంటు జరగదు అయినప్పటికీ రాష్ట్రపతి లేకుండా పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాలని ప్రధాని మోడీ నిర్ణయించడం అమర్యాదకరమైన చర్యని, అత్యున్నత రాష్ట్రపతి కార్యాలయాన్ని అవమానించడమే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించడమేనన్నారు. తక్షణమే భారతదేశ నూతన పార్లమెంట్ భవనంలో భారత రాష్ట్రపతిని ఆహ్వానించి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

అధిక ధరలకు మాంసం విక్రయిస్తే చర్యలు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలో మాంసం విక్రయాలు అధిక ధరలకు విక్రయించడం సరికాదని పురపాలక కమిషనర్ వివి నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభ భవనంలో గురువారం మటన్, చికెన్ అమ్మకందారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామాల్లో కిలో మాంసం రూ.650కి విక్రయిస్తున్నారని, పులివెందులలో అంతకుమించి అమ్మడం సరైన పద్ధతికాదన్నారు. మాంసం కోసం క్యారియర్ తెచ్చుకునే వారికి చికెన్ వ్యాపారస్తులు రూ.20 తగ్గించి ఇవ్వాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని సూచించారు. అలా వాడితే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 'ప్రజాశక్తి' దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన 'వామ్మో మాంసం కొనలేం' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

నిబంధనలకు వ్యతిరేకంగా పనులు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలో చేపడుతున్న నూతన జాతీయ రహదారి పనుల్లో ప్రారంభంలోనే అవక తవకలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ ప్రారంభంలోనే విద్యుత్ విస్తరణ పనులను చేపట్టింది. ఈ పనుల నిర్మాణంలో టవర్ల ఏర్పాటులో కాంక్రీట్ పనులు చేపట్టి, తక్కువ మోతాదులో కాంక్రీట్ వేసి విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశారు. టవర్లకు భూమి లోపలికి కాంక్రీట్ వేసి, కోపింగ్ కాంక్రీట్ లేకుండా విద్యుత్ వైర్లు బిగించారు. ఇందువల్ల భవిష్యత్తులో టవర్లు తుప్పుపట్టి, అవి కూలిపోయే ప్రమాదం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. అన్ని టవర్లకు కోపింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ అలా కాకుండా దాదాపుగా 300 విద్యుత్ స్తంభాలు పాత వాటినే వినియోగించారు. విద్యుత్ అధికారులకు తెలిసి కూడా మిన్నకుండిపోవడంలో ఆంతర్యం ఏమిటని విమర్శిస్తున్నారు. ఇంతవరకు విద్యుత్ అధికారులు పరిశీలించిలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు శ్రద్ధ వహించి ఇక్కడ ఏర్పాటు చేసిన నాశిరకమైన పనులపై చర్యలు తీసుకోవాలని, కొత్త స్తంభాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


భూమిలోకి కాంక్రీట్ కోపింగ్ లేని టవర్లు

సమస్యలపై అధికారులు స్పందించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఉన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆమ్మఅద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ పరిధిలోని 6వ వార్డులోని సమ స్యలను అమ్మఅద్మీ పార్టీ నాయకులు ప్రజల నుండి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రహం తుల్లా మాట్లాడుతూ 6వ వార్డులో ఉన్న మురు గు కాలువపై సిమెంట్ అచ్చులు వేయాలని కోరారు. మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉండడం వల్ల విషక్రిములు ఇంట్లోలోకి వస్తున్నాయని తెలిపారు. ప్రజలు సమస్యలతో అల్లాడుతుంటే ఏమీపట్టనట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించడం శోచనీయమన్నారు. దోమలు కూడా విపరీతంగా పెరిగిపోవడం పట్ల ప్రజలు రోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. సిమెంటు రోడ్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆమ్అద్మీ పార్టీ నాయకులు గౌస్‌పీర్, దాదాపీర్, సలీం పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. లోకేష్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.


లోకేష్ పాదయాత్రలో టిడిపి నాయకులు

చాపాడు : జమ్మలమడుగు నియోజకవర్గంలో మూడో రోజు కొనసాగుతున్న యువగళం పాదయాత్రలో గురువారం తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్ పాల్గొని లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పాదయాత్ర ప్రారంభం నుంచి ప్రతి రోజూ తెలుగు యువత సభ్యులతో కలిసి మద్దతుగా లోకేష్ అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగుతున్నారు.

ఎర్రగుంట్ల : టిడిపి ఇన్‌ఛార్జి చదివిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపుమేరకు గురు వారం మండలంలోని టిడిపి నాయకులు లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. రమేష్‌రెడ్డి, బయపురెడ్డి, సంజీవరెడ్డి, చాంద్‌బాషా, దాసరి రాజారెడ్డి, కోడూరు శివారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రంగసాయపురం పవన్, నిడ్జి షరీఫ్, కొండారెడ్డి, మండలశాఖ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, అబ్దుల్, మల్లేష్, కార్యకర్తలు తరలివెళ్లారు.

ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనందన్‌బాబు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి)అధ్యక్షుడు ఆధ్వర్యంలో జెవివి సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు గురువారం స్థానిక జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. 6నుండి 10వ తరగతి విద్యార్థులు వైద్య విభాగాలు, పరికరాలు, చికిత్స తదితర విష యాలపై అవగాహన పెంపొందించుకునేలా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరుగుతుందన్నారు. రేడియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా డెమో ఇచ్చారు. రోగులకు ఆక్సిజన్ అందించే పరికరాలు, ఎంఆర్ఐ, సిటి స్కానింగ్,ఎక్స్-రే పనితీరును విదార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తాము ఆరోగ్య పరిరక్షణ ప్రథమ చికిత్స, వైద్యవిధానం గురించి చాలా విషయాలు ప్రత్యక్షంగా తెలుసుకోగలిగామని విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధాన కార్యదర్శి సునీత, కార్యదర్శి కళ్యాణ్‌కృష్ణ, సమన్వయకర్తలు హాసిని, అక్షయ, భరత్, జాహ్నవి, యోచిత, నిఖిల్‌తేజేష్, జావిద్ పాల్గొన్నారు.


ఆరోగ్య విషయాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

క్రైం కార్నర్

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని వినాయకనగర్‌లో నివాసం ఉండే కుమ్మితి రవి (46) అనే వ్యక్తి బుధవారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు తన భార్య మేరీతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతునికి మొదటి భార్య చనిపోవడంతో మేరీని రెండవ పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. రవికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ కెఎస్ వర్మ తెలిపారు.

ఉపాధి.. కానరాని కనీస వసతులు

- ఎండలకు పనిచేయలేకపోతున్న కూలీలు.. కనిపించని ఒఆర్ఎస్ ప్యాకెట్లు



ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులలో కనీస వసతులు కరువయ్యాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ కూలీలు వేసవిలో ఎండలకు పని చేయలేక అల్లాడిపోతున్నారు. వ్యవసాయ పనుల్లేని కాలంలో ఉపాధి చట్టం అమలు చేయాల్సి ఉంది. అయితే వేసవిలో పనులు చేసే కూలీలకు ప్రభుత్వం కొన్ని కనీస వసతులు కల్పించాల్సి ఉంది. ఎండ వేడిమికి ఉపశమనం కలిగించేలా టెంట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఏడాదిగా అవి కనిపించడంలేదు. ఎండలకు తాళలేక కూలీలు వడదెబ్బకు గురయ్యే పరిస్థితులు కూడా లేకపోలేదు. పులివెందుల మండలంలోని రాగిమానపల్లె, అచ్చువెల్లి, కణంపల్లి, ఎర్రిపల్లి, ఎర్రబల్లి, కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో మొత్తం జాబ్ కార్డులు 2,650 కార్డులు ఉండగా.. ప్రస్తుతం 1,231 మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు. మిగతావారు ఎండలకు తాళలేక వెళ్లలేని పరిసితి. కొత్తపల్లికు సంబంధించి 517 జాబ్‌కార్డులు ఉండగా ఇందులో 520 మంది పనికి వెళ్తున్నారని, ఇది రాగిమానుపల్లెకు సంబంధించి 333 మంది ఉండగా కేవలం 195 మంది మాత్రమే పనులకు వెళుతున్నారు. అలాగే ఎర్రిపల్లెకు సంబంధించి122 మంది ఉండగా 68 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఎర్రబల్లెకు సంబంధించి 725 మందికిగానూ కేవలం 260 మంది మాత్రమే పనికి వెళ్తున్నారు. అలాగే కొత్తపల్లె పంచాయతీకి సంబందించి 258 మందికిగానూ 67 మంది మాత్రమే. కణంపల్లికు సంబంధించి 166 మందికిగానూ 82 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఎండ పరిస్థితి ప్రభావం ఎలా ఉందో అధికారులకు తెలుసు. గతేడాదిలో మండలానికి పులివెందుల ఆరు పంచాయతీలకు 32 టెంట్లు ఇవ్వగా, అవి ఏమయ్యాయో అర్థం కావడం లేదని కూలీలు బాహాటంగా విమర్శిస్తున్నారు. పనిలో కూలీలు గాయపడితే ప్రథమ చికిత్స అందించేందుకు ఆరు పంచాయతీలకు ఆరు కిట్లు ఇచ్చారు. ప్రస్తుతం అవి వినియోగిస్తున్నారోలేదో అనే అను మానాలున్నాయి. కూలీలు వడదెబ్బకు గురికాకుండా నివారించేందుకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాల్సి ఉన్నా. అవి తమకు అందడలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లను మేట్ల ద్వారా పంపిణీ చేసేవారు. ప్రతిరోజు ఉపాధి పనికి వెళ్లే కూలీల హాజర పట్టికను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు వీటి వివరాలు పంపిస్తుంటారు. ఒక కూలీకి రూ.270 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.241 మాత్రమే ఇస్తున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా వీరు చేసే పనిని ప్రతిరోజు ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు, ఎపిఒలు పర్యవేక్షించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ప్రతి కూలీకి ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందేలా చూడాలని కోరుతున్నారు. అలాగే ఎండకు కాస్త ఉపశమనం కలిగించేందుకు టెంట్లను ఏర్పాటు చేయాలని, దినసరి కూలి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.270 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. కూలీలకు రవాణా ఛార్జీని కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూలీలకు కనీస వసతులు కల్పిస్తాం



'ఉపాధి' కూలీలకు ఫీల్డ్‌లో అన్ని వసతులు కల్పిస్తాం. టెంట్లు ఏర్పాటు చేయలేదనే విష యం తెలియలేదు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించేలా చర్యలు తీసుకుంటాం. కూలీల రవాణా ఛార్జీ విషయంలో 5 కిలోమీటర్లు పైబడితే రానుపోను రూ.40 ఇస్తామని, అయితే పులివెందుల మండలంలో మాత్రం అలాంటి దూరం లేకపోవడంతో రవాణా ఛార్జీలు చెల్లించడంలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కూలీకి సంబంధించి నిర్దేశించిన పని చేస్తేనే అందుకు నిర్దేశించిన వేతనం మాత్రమే ఇస్తున్నాం. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ రూ.241మాత్రమే కూలి పడుతుంది. ఉపాధి పనులపై ప్రతిరోజూ రెండు పంచాయతీలు వెళ్లి పనులను పర్యవేక్షిస్తూంటాం. నిత్యం ఫీల్డ్‌అసిస్టెంట్ పర్యవేక్షణలోనే పనులు జరుగుతున్నాయి. **- పుష్పలత, ఎపిఒ**

రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం దురదృష్టకరం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె



భారత పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ చర్య రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం, ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమని పేర్కొన్నారు. భారత పార్లమెంటు భవనం దేశ సార్వభౌమత్వానికి ప్రతీక అన్నారు. అలాగే భారత రాష్ట్రపతి దేశ ప్రథమ పౌరురాలని చెప్పారు. పార్లమెంటు అంటే రాష్ట్రపతి, లోక్ సభ, రాజ్యసభ అని భారత రాజ్యాంగం 79వ అధికరణ స్పష్టంగా పేర్కొందన్నారు. గిరిజన మహిళను భారత రాష్ట్రపతిగా చేసిన ఘనత బిజెపిదని గతంలో ప్రధాని మోడీ అన్నారని తులసిరెడ్డి గుర్తు చేశారు. అలాంటి గిరిజన మహిళను ఇలా అవమాన పరచడం న్యాయమా, ధర్మమా అని తులసిరెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంపై పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తులసిరెడ్డి సూచించారు. అమరావతి రైతులపై ఉక్కుపాదం, అవినాష్‌రెడ్డి అనుచరులపై దాసోహం అన్నట్లుంది రాష్ట్ర పోలీసు యంత్రాంగం పని తీరని ఎద్దేవా చేశారు. అమరావతిలో భూములు ఇచ్చిన రైతులు, మహిళలు శాంతియుతంగా చేస్తున్న నిరసన కార్యక్రమాలపై పోలీసులు ఉక్కుపాదంతో అరెస్టు చేసి నిరసన కార్యక్రమాలను భగ్నం చేయడం గర్హనీయమన్నారు. కర్నూలులో అవినాష్‌రెడ్డి అనుచరుల నిరసన కార్యక్రమానికి పోలీసులు దగ్గర ఉండి సహకరించడం విడ్డూరమన్నారు.

జీపు జాతాను విజయవంతం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి నిర్వహించతలపెట్టిన జీపుజాతాను విజయవంతం చేయాలని కార్మిక నాయకులు కోరారు. ఆ మేరకు వారు స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు మున్సిపల్ కార్మిక సంక్షేమ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంటి, సాల్మన్ మాట్లాడుతూ ఈ నెల 31న హిందూపురం నుండి విజయవాడ వరకు ఒక జీపుజాతా, ఇచ్చాపురం నుండి విజయవాడ వరకు మరో జీపుజాతా ప్రారంభమవుతుందన్నారు. జూన్ 3న మధ్యాహ్నం జీపుజాతా ప్రొద్దుటూరుకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమాన్ని కార్మికులు, ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు విజయకుమార్, రవికుమార్, జాకోబ్, గురమ్మ, ప్రమీలమ్మ, నీతమ్మ, రమాదేవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి...!

- రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని ఎత్తపువారికాలనీలో మూడు రహదారులు కలిసే కూడలిలో డ్రెయినేజీ కాలువపై రెండు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలు రోడ్డుకు నడిమధ్యలో ఉండడం వల్ల ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు మధ్యలో రెండు గుంతలు ఉండగా ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నుంచి ముద్దనూరు మెయిన్ రోడ్డుకు వెళ్లే మార్గం, ఎత్తపువారి కాలనీలోనికి వెళ్లే మార్గం కలుస్తాయి. దీంతో ఈ మూడు రోడ్ల కూడలిలో నిత్యం స్కూటరిస్టులు, కార్లలో, పాదచారులు వెళుతుంటారు. డ్రయినేజీ కాలువపై రాళ్లు పగిలిపోయి మలుపులో రెండు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో మునిసిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది ప్రతిరోజూ వెళుతున్నారు.. అయినా ఈ గుంతలను ఏ అధికారి పట్టించుకోవడంలేదు. ఈ ప్రాంతంతో వీధిలైట్లు లేవు. దీంతో రాత్రి సమయాల్లో ఈ దారిన వెళ్లాలంటే ద్విచక్రవాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అంతే కాకుండా మలుపులోని గుంతల వల్ల స్కూటరిస్టులు పక్కనే ఉన్న మురుగు కాలువలో పడే ప్రమాదం ఉందని వాహన దారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ కూడలిలో ఉన్న మురుగు కాలువపై పడిన గుంతలను పూడ్చాలని వాహన దారులు, ప్రయాణికులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న గుంతలు

ఆకట్టుకున్న ఎడ్ల బండలాగుడు పోటీలు

దువ్వూరు : ఇడమడక గ్రామంలో వెలసిన గంగమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పందేలు ఆకట్టుకున్నాయి. మొదటి బహుమతిని నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బొరెడ్డి కేశవరెడ్డి, రెండవ బహుమతి ఖాజాహుస్సేన్, మూడవ బహుమతి కెవిఎస్‌బుల్స్ కుర్ర వెంకటేష్ యదవ్, నాలుగవ బహుమతి గుండం చెన్నారెడ్డి, ఐదవ బహుమతి ఆత్తోట శిరిష చౌదరి శివకృష్ణ చౌదరి ఎడ్లు గెలుచుకున్నాయి.

హౌసింగ్ లక్ష్యాన్ని పూర్తి చేయండి

స్థానిక మండల పరిషత్ సభ భవనంలో గురువారం హౌసింగ్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని స్పెషలాఫీసర్ ఓబులేసు తెలిపారు. స్పందనలో ప్రజలు అందించిన ఫిర్యాదులకు వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ రమాకుమారి, ఎలక్ట్రికల్ ఎఇ వీరారెడ్డి, ఎఇ సుబ్రహ్మణ్యం, విఆర్ఒలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హీరో సుమన్ ఆర్థిక సాయం

ఎర్రగుంట్ల : తిప్పలూరులోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమానికి సినీ నటుడు సుమన్ రూ.లక్ష ఆర్థికసాయాన్ని గురువారం ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్రకు అందించారు. ఎంతోమంది అభాగ్యులను చేరదీసి సేవ చేస్తున్న అనాథాశ్రమాభివృద్ధికి తన వంతుగా ఈ ఆర్థికసాయాన్ని అందించినట్లు ఆ తెలిపారు. సుమన్‌కు నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం

- న్యాయం చేయాలని కూలీల వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండలంలోని పొన్నతోట గ్రామ పంచాయతీలోని నర్సోజి కొట్టాల గ్రామాల్లోని ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ రవీంద్ర చేతివాటం చూపిస్తున్నారని గురువారం ఎపిఒ మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 300 మంది ఉపాధి కూలీలున్నారని, ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం చూపి ప్రస్తుతం 120 మందిమే పనిలోకి వస్తున్నామన్నారు. పనికిరాని వారికి, బంధువులకు, ఉద్యోగం చేసే వ్యక్తులకు పనికి వచ్చినట్లు మస్టర్‌లో పేరు పెట్టి మా కష్టార్జితాన్ని వారి ఖాతాలో వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న కేశవకు రూ.4,300, వారి అమ్మ ఖాతాలో దాదాపు రూ.4000 వేస్తున్నారన్నారు. మేము వారం వరకు పని చేసినా.. రెండు, మూడు రోజులు కూలీ మాత్రమే అది కూడా తక్కువ వేస్తున్నారన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.


ఉపాధి కార్యాలయం వద్ద బైఠాయించిన కూలీలు

ఆరోపణలు రుజువైతే చర్యలు : ఎపిఒ

మీరు చేసిన ఆరోపణలు నిజమని తేలితే కచ్చితంగా చర్యలు తీసుకొని న్యాయం చేస్తానని ఎపిఒ మహేశ్వరరెడ్డి కూలీలకు హామీ ఇచ్చారు.

లోకేష్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కులేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు ప్రొద్దుటూరులో పాదయాత్ర చేసే నైతిక హక్కులేదని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు లోకేష్ రావడానికి తనకు అభ్యంతరం లేనప్పటికీ, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తానన్నారు. 2014 -19 కాలంలో చంద్రబాబు హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజల ప్రయోజనార్థం ఎన్ని నిధులు వచ్చాయి.. ఏమి నిర్మాణాలు చేపట్టారు.. మంచినీటి కోసం కనీసం ఒక్క బోరింగ్ అయినా వేశారా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. వారి హయాంలో ఎలాంటి అభివృద్ధి చేయనందున ప్రొద్దుటూరులో అడుగుపెట్టే నైతిక హక్కు కోల్పోయారన్నారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా లోకేష్ ప్రొద్దుటూలో పాదయాత్ర చేసి వెళ్లిపోతే అసమర్థుడిగా భావించాల్సి వస్తుందని రాచమల్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సూచించారు. గురువారం చిన్న కొండప్ప కాలనీ సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో కమిషనర్ మాట్లాడుతూ స్పందనలో ఎవరైనా వారి సమస్యలపై అర్జీలు పెడితే వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ కొండలరావు, మున్సిపల్ సిబ్బంది, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలే నిజమైన నివాళి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రజాపోరాటాలే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక విభిన్నప్రతిభావంతుల కాలనీకి చెందిన యత్తపు గురివిరెడ్డి మొదటి వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కాలనీకి యత్తపు గురివిరెడ్డి నగర్ కాలనీగా నామ కరణం చేశారు. సిపిఎం మఠం మండల కమిటీ ఆధ్వ ర్యంలో మండల కార్యదర్శి ఎస్.గోవిందు అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమానికి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, మండలం కమిటీ సభ్యులు, కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ యత్తపు గురివిరెడ్డి 20 ఏళ్లకుపైగా పార్టీలో పలు శాఖల్లో నిర్వహించిన ప్రజాపోరాటాల్లో కీలకపాత్ర వహించారని కొనియాడారు. జి.శివకుమార్ మాట్లాడుతూ నాతో కలిసి పని చేసిన సహచరున్ని కోల్పోయి నేటికి ఏడాదికావస్తోందన్నారు. ఆయనలేని లోటు సిపిఎం మండల కమిటీకి పూడ్చలేనిదన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్ మాట్లాడుతూ మండలంలో పేద ప్రజలందరిని ఐక్యం చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు పాలక ప్రభుత్వాలతో రాజీలేని పోరాటాలు నిర్వ హించడమే యత్తపు గురివిరెడ్డికి నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మండలం కమిటీ సభ్యులు గండి గురయ్య, గండి సునీల్‌కుమార్, హరి, సుబ్బమ్మ, మేరీ, అజయ్, భాస్కర్, నాయుడు, రమణ, లక్ష్మీనారాయణ, కామ్రేడ్ యత్తపు గురువిరెడ్డి నగర్ నివాస ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.


గురివిరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నాయకులు